నమస్తే తెలంగాణ
మెదక్
I | హైదరాబాద్, మంగళవారం 8 ఏప్రిల్ 2025 | MEDAK

ప్రజా సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

- మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్
- ప్రజావాణిలో 95 దరఖాస్తుల స్వీకరణ

ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్, ఏప్రిల్ 7 (నమస్తే తెలంగాణ): ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. సోమవారం గ్రీవెన్స్ డే సందర్భంగా కలెక్టరేట్‌లో ప్రజావాణి నిర్వహించి, ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి దరఖాస్తుదారుడికి న్యాయం చేయాలనే లక్ష్యంతో అధికారులు విధులు నిర్వహించాలన్నారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని, ప్రతి ఒక్క దరఖాస్తును సమగ్రంగా పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులు నిర్దిష్ట సమయంలో స్పందించాలని సూచించారు. ప్రజలు అధికారులను నేరుగా కలిసే వేదిక ప్రజావాణి అని పేర్కొంటూ, ప్రజా సమస్యలు తక్షణమే పరిష్కరించి ప్రజల మన్ననలు పొందాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ధరణి 9, భూ సమస్యలు-38, పింఛన్-5, ఇతర సమస్యలు-43 మొత్తం-95 దరఖాస్తు స్వీకరించామని చెప్పారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేశ్, జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఆర్వో భుజంగరావు, ఏవో యూనస్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎండు గంజాయి తరలిస్తున్న ఇద్దరికి రిమాండ్

పోలీసులు స్వాధీనం చేసుకున్న ఎండు గంజాయి

మునిపల్లి, ఏప్రిల్ 7: జహీరాబాద్ నుంచి హైదరాబాద్‌కు ఎండు గంజాయి తరలిస్తున్న ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు మునిపల్లి ఎస్సై రాజేశ్ నాయక్ తెలిపారు. సోమవారం మండలంలోని బుదేరా పోలీస్‌స్టేషన్లో ఎస్సై మాట్లాడుతూ బీదర్ నుంచి హైదరాబాద్‌కు ఎండు గంజాయి తరలిస్తున్నట్లు నమ్మదగిన సమాచారం మేరకు మండలంలోని కంకోల్ టోల్‌ప్లాజా వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. జహీరాబాద్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న స్కూటీపై (టీజీ 08జి 5971) మహ్మద్ అయూబ్ అలీ, షేక్ సమీర్ వద్ద ఎండు గంజాయి కనిపించడంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని విచారించారు. 120 గ్రాముల ఎండు గంజాయిని బీదర్ లోని ఇరానీ గల్లీలో ఇర్ఫాన్ అనే వ్యక్తి వద్ద కొనుగోలు చేసి హైదరాబాద్‌కు తీసుకువస్తున్నట్లు వారు ఒప్పుకున్నారు. దీంతో పోలీసులు ఎండు గంజాయిని స్వాధీనం చేసుకోవడంతో పాటు వారిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. చాకచక్యంగా వ్యవహరించి దుండగులను పట్టుకున్న పోలీసులను కొండాపూర్ సీఐ వెంకటేశ్ అభినందించారు.

పిస్టల్, బుల్లెట్లు స్వాధీనం

- వర్గల్‌లో ఇద్దరు, సికింద్రాబాద్‌లో ఒకరు అరెస్టు
- బీహార్ నుంచి కొనుగోలు చేసిన పిస్టల్, 35 బుల్లెట్లు
- జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలింపు

వివరాలు వెల్లడిస్తున్న సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి

గజ్వేల్/వర్గల్, ఏప్రిల్ 7: నేరాలు చేసేందుకు అనుమానాస్పద స్థితిలో తిరుగుతున్న వారిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా వారి వద్ద 35 బులెట్లు, ఒక ఒరిజినల్ పిస్టల్, మరో నకిలీ పిస్టల్, నాలుగు పెప్పర్ స్ప్రే బాటిల్స్, రెండు ఐరన్ నకిలీ డస్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి తెలిపారు. సోమవారం గౌరారం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితులను మీడియాకు చూపించి వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివారం శ్రీరామనవమి రోజున వర్గల్‌లో బందోబస్తులో ఉన్న పోలీసులకు మెదక్ జిల్లా రామాయంపేట మండలం నస్కల్ గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ ఎండీ ఎథిజాజ్, సికింద్రాబాద్‌లోని నేరేడ్‌మెట్ డిఫెన్స్ కాలనీకి చెందిన డిగ్రీ విద్యార్థి ఎండీ హిదాయత్ అలీ అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపించడంతో వారిని అదుపులోకి తీసుకొని విచారించారు. ఎండీ ఎథిజాజ్ వద్ద ఉన్న బ్యాగులో 30బుల్లెట్స్, రెండు వాడిన బుల్లెట్ కోకాలు, రెండు మొబైల్ ఫోన్లు, అసలు ఆధార్‌కార్డుతో పాటు రెండు నకిలీ ఆధార్ కార్డులు, రెండు డెబిట్ కార్డులు, రెండు మెమోరి, సిమ్‌కార్డులు, రెండు ఐరన్ నకిలీ డస్టర్లు, నాలుగు బాటిల్స్ పెప్పెర్ స్ప్రే, హిదాయత్ దగ్గర ఒక పిస్టల్, ఐదు బుల్లెట్స్, హోండా ఆక్టివా, రెండు ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మరొకరు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా గబ్బిలాల్‌పేటకు చెందిన మద్దూర్‌లాల్(నాని) ఇంటి వద్ద ఉన్నట్లు తెలుపడంతో అతడిని అదుపులోకి తీసుకొని డమ్మీ రివాల్వ, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీరు ఆర్థిక సమస్యల కారణంగా నేరాలు చేసేందుకు కుట్రపన్నారు. వీరిలో ఎథిజాజ్, హిదాయత్ బీహారు రాష్ట్రంలోని ముంగర్ పట్టణానికి వెళ్లి పిస్టల్. 8 బుల్లెట్లు కొనుగోలు చేసి హైదరాబాద్‌కు వచ్చారు. కొనుగోలు చేసిన పిస్టల్‌ను ట్రయల్ చేసేందుకు జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో షూటింగ్ ప్రాక్టీస్ చేశారు. ఆ తర్వాత ఇద్దరూ సికింద్రాబాద్‌లోని హోటల్ సుప్రభాత్‌లో ఈనెల 2 నుంచి 5వరకు ఉండి సికింద్రాబాద్ చుట్టుపక్కల నేరాలు చేయాలని నిర్ణయించుకొని ప్రయత్నాలు చేశారు. కానీ, సీసీ కెమెరాల పర్యవేక్షణ ఎక్కువగా ఉండడంతో అనుకున్న విధంగా నేరాలు చేయడం వీలుకాలేదు. గ్రామీణ ప్రాంతాల్లో నేరాలు చేయాలనే నిర్ణయంతో ఈనెల 6న శ్రీరామనవమి రోజున వర్గల్ మండల కేంద్రానికి వచ్చి అనుమానాస్పదంగా తిరుగుతూ పోలీసులకు పట్టుబడ్డారు. వీరిపై కేసు నమోదు చేసి సోమవారం గజ్వేల్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కొమురవెల్లి ఆలయ ఈవోగా అన్నపూర్ణ

బాధ్యతలు స్వీకరిస్తున్న అన్నపూర్ణ

చేర్యాల, ఏప్రిల్ 7: కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ ఈవోగా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ అన్నపూర్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్ నగరంలోని చిక్కడపల్లి వేంకటేశ్వరస్వామి దేవాలయ ఈవోగా బాధ్యతలు నిర్వహిస్తున్న అన్నపూర్ణకు దేవాదాయ శాఖ కమిషనర్ కొమురవెల్లి ఆలయ ఈవోగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేశారు. మల్లికార్జున స్వామిని ఆమె దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మల్లన్న ఆలయ అభివృద్ధికి కృషి చేయడంతో పాటు భక్తులకు అన్ని వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో ఏఈవో బుద్ధి శ్రీనివాస్, పర్యవేక్షకులు శ్రీరాములు, సురేందర్‌రెడ్డి, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.


నీళ్లు లేక నిజాంపేటలో రైతు రమేశ్‌కు చెందిన వరిపంట ఎండిపోవడంతో మేకలు మేస్తున్న దృశ్యం


మార్డి గ్రామంలో నీళ్లులేక ఎండిపోయిన జొన్న పంట

రైతన్నకు సాగునీటి గోస

సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ ప్రాంతంలో సాగునీరు లేక ఎండుతున్న పంటలు

- కల్హేర్, సిర్గాపూర్, నిజాంపేటల్లో భారీగా పంటనష్టం
- ఎండిన వరి పొలాల్లో పశువులు, మేకలను మేపుతున్న రైతులు
- నల్లవాగు నుంచి సాగునీరు వదలకపోవడంపై కల్హేర్ రైతుల ఆగ్రహం
- రైతులకు రూ.లక్షల్లో పంటనష్టం
- ప్రభుత్వం పరిహారం ఇవ్వాలని డిమాండ్

సంగారెడ్డి, ఏప్రిల్ 3(నమస్తే తెలంగాణ) : సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గంలో మళ్లీ కరువు ఛాయలు కమ్ముకుంటున్నాయి. సాగు, తాగునీరు లేక రైతులు, ప్రజలు గోసపడుతున్నారు. ఈ ప్రాంతంలోని చెరువులు పూర్తిగా ఎండిపోయాయి. భూగర్భజలాలు అడుగంటడంతో బోరుబావుల్లో నీళ్లు అడుగంటాయి. దీంతో నారాయణఖేడ్ నియోజకవర్గం అంతటా పంటలు ఎండిపోతున్నాయి. కండ్ల ఎదుట వరి, జొన్న పంటలు ఎండిపోతుంటే రైతుల గుండెలు అవిసిపోతున్నాయి. ఎండిన వరి పొలాలను ఏమి చేయాలో దిక్కుతోచక రైతులు పశువులను, మేకలను మేపుతున్నారు. నల్లవాగు ప్రాజెక్టులో నీళ్లు అందుబాటులో ఉండడంతో కల్హేర్ మండలంలోని చివరి ఆయకట్టు రైతులు సాగునీటిపై ఆశతో వరి, జొన్న, ఇతర పంటలు సాగు చేశారు. నల్లవాగు ప్రాజెక్టులో నీళ్లున్నా నీటిపారుదల శాఖ సాగునీరు విడుదల చేయడం లేదు. దీంతో సిర్గాపూర్, కల్హేర్ మండలాల్లో 800 ఎకరాలకుపైగా వరి, జొన్న పంటలు నీళ్లందక ఎండిపోతున్నాయి. నల్లవాగు కాల్వల ద్వారా సాగునీరు విడుదల చేస్తే వరి, జొన్న పంటలు చేతికివచ్చే అవకాశం ఉందని, విడుదల చేసి పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు. పంటలు ఎండిపోయి రూ.లక్షల్లో నష్టపోయామని, ప్రభుత్వం పరిహారం అందజేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

వెంటాడుతున్న కరెంటు కోతలు

నారాయణఖేడ్ నియోజకవర్గంలో చెరువులు, బోరుబావుల కింద వరి, జొన్న ఇతర పంటలు సాగు చేసిన రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. చెరువులు ఎండిపోవటంతో రైతులు ఎక్కువగా యాసంగిలో ఆరుతడి పంటలు వేశారు. బోరుబావుల కింద రైతులు వరి, నీటిజొన్న పంటలు సాగు చేశారు. రెండు నెలలుగా నారాయణఖేడ్ ప్రాంతంలో భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. దీంతో బోరుబావులు నీళ్లు పోయడం లేదు. దీనికితోడు అనధికారిక కరెంటు కోతలు రైతులకు ఆశనిపాతంలా మారుతున్నాయి. బోర్లు నీళ్లుపోయక పోవడం, కరెంట్ కోతల కారణంగా నారాయణఖేడ్ నియోజకవర్గంలోని కంగ్టి, నాగల్‌గిద్ద, సిర్గాపూర్, కల్హేర్, నిజాంపేట మండలాల్లోని పలు గ్రామాల్లో బోరుబావులు ఎండిపోవడం, బోర్లు గ్యాప్ ఇచ్చి నీళ్లు పోయడంతో వరి, జొన్న పంటలు ఎండిపోతున్నాయి. దీంతో కొంతమంది రైతులు ఎకరానికి రూ.6 నుంచి రూ.8వేలు తీసుకొని వలసవచ్చిన గొర్రెలకాపరులకు పచ్చటి పొలాలు మేతకు అప్పగిస్తున్నారు.

నల్లవాగు కింద ఎండుతున్న పంటలు

నారాయణఖేడ్ నియోజకవర్గంలోని నల్లవాగు ప్రాజెక్టు కింద పంటలు ఎండిపోతున్నాయి. నల్లవాగు ప్రాజెక్టు పూర్తినీటి సామర్థ్యం 1493 ఫీట్లు, ప్రస్తుతం ప్రాజెక్టులో 1480 ఫీట్ల మేర జలాలు ఉన్నాయి. ఏటా యాసంగి సీజన్‌లో 6వేల ఎకరాలకు ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందజేస్తారు. చివరి ఆయకట్టు కల్హేర్ మండలంలోని గ్రామాలకు సైతం సాగునీరు అందజేస్తారు. ఈ ఏడాది ప్రాజెక్టుల్లో సాగునీళ్లు అందుబాటులో ఉన్నప్పటికీ నీటిపారుదల శాఖ సిర్గాపూర్, కల్హేర్ మండలాల్లోని 4090 ఎకరాలకు సాగునీరు ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది. ప్రాజెక్టులో నీళ్లు అందుబాటులో ఉండడంతో రైతులు కాల్వలు, బోరుబావుల కింద రైతులు 5వేల ఎకరాల వరకు వరి, జొన్న పంటలు వేశారు. కల్హేర్ మండలంలోని చివరి ఆయకట్టు ఉన్న గ్రామాల రైతులు కాల్వల కింద వరి, జొన్న పంటలు సాగు చేశారు. ఇప్పుడు నల్లవాగు ప్రాజెక్టు ద్వారా చివరి ఆయకట్టుకు సాగునీరు ఇవ్వడం లేదు. దీనికితోడు సిర్గాపూర్, కల్హేర్ మండలాల్లోని చాలా గ్రామాల్లో బోరుబావులు నీళ్లులేక ఎండిపోయాయి. దీంతో వరి, జొన్న పంటలు సాగునీరు అందక ఎండిపోతున్నాయి. నల్లవాగు ప్రాజెక్టు దిగువన ఉన్న మార్డి, కిష్టాపూర్, ఖానాపూర్, ఇందిరానగర్, కల్హేర్ గ్రామాల్లో సాగునీరు అందక వందలాది ఎకరాల్లో వరి, జొన్న పంటలు ఎండిపోతున్నాయి. నల్లవాగు ప్రాజెక్టులో నీళ్లు ఉన్నప్పటికీ పంటలు ఎండిపోతున్నా సాగునీరు విడుదల చేయకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చాలా గ్రామాల్లో పంటలు ఎండిపోవడంతో రైతులు పొలాల్లో పశువులు, మేకలను మేపుతున్నారు.

కిష్టాపూర్ గ్రామం వద్ద నల్లవాగు కాలువ దుస్థితి

కల్హేర్ శివారులో నీళ్లులేక ఎండిపోయిన వరి పంట

జొన్న పంట పూర్తిగా ఎండిపోయింది..

నాకున్న ఐదెకరాల్లో బోరుబావుల కింద వరి, జొన్న పంటలు వేశా. నల్లవాగు నుంచి సాగునీరు ఇస్తారన్న ఆశతో కాల్వల కింద జొన్న పంట సాగు చేశా. నాకున్న రెండుబోర్లు ఇప్పుడు పట్టిపోయాయి. బోర్ల నుంచి నీళ్లు రాక వరి, జొన్న పంటలు ఎండిపోతున్నాయి. నల్లవాగు కాల్వ కింద రెండు ఎకరాల్లో సాగుచేసిన జొన్న పంట నీళ్లులేక పూర్తిగా ఎండిపోయింది. ప్రభుత్వం పరిహారం ఇచ్చి ఆదుకోవాలి.

– మల్‌దొడ్డి చేతక్, రైతు, మార్డి (సంగారెడ్డి జిల్లా)

సాగునీరు లేక పొలం ఎండిపోయింది..

నేను నాలుగెకరాల్లో యాసంగి సీజన్‌లో బోరుబావి కింద వరి పంట వేశా. బోరుబావి నుంచి నీళ్లు తక్కువగా వచ్చినా.. నల్లవాగు కాల్వ నుంచి నీళ్లు వస్తాయని ఆశతో వరి పంట సాగు చేశా. ఇప్పుడు బోరుబావి పూర్తిగా ఎండిపోయింది. మా పొలం పైన ఉన్న పెద్ద చెరువు నుంచి నీళ్లు రావడం లేదు. నల్లవాగులో నీళ్లు ఉన్నా అధికారులు కాల్వల ద్వారా సాగునీరు ఇవ్వడం లేదు. సాగునీరు ఇచ్చి రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం పంటలు ఎండిపోతుంటే చోద్యం చూస్తుంది. ఇకనైనా ప్రభుత్వం, అధికారులు మా పరిస్థితిని గమనించి నల్లవాగు కాల్వల నుంచి నీరిచ్చి పంటలను కాపాడాలి.

– విఠల్, రైతు, కిష్టాపూర్ (సంగారెడ్డి జిల్లా)

రెండు ఎకరాల్లో వరి పంట దెబ్బతిన్నది..

బోరుబావి కింద రెండు ఎకరాల్లో వరి పంట వేశా. కరెంటు కోతలు, బోరు పోయకపోవడంతో రెండు ఎకరాల పంట ఎండిపోతున్నది. మొదట బాగానే నీళ్లుపోసిన బోరుబాయి ఇప్పుడు భూగర్భజలాలు అడుగంటడంతో ఎండిపోయింది. నల్లవాగు నుంచి నీళ్లు రావడం లేదు. దీంతో కండ్ల ఎదుట పంట ఎండిపోతున్నా... ఏమి చేయలేకపోతున్నాం. పంట ఎండిపోవడంతో రూ.లక్షకుపైగా నష్టం వచ్చింది.

– శంకర్, రైతు, కిష్టాపూర్(సంగారెడ్డి జిల్లా)

పొలాల్లో పశువులను మేపుతున్నాం...

రెండు బావుల కింద నాలుగు ఎకరాల్లో వరి పంట వేశా. ఇప్పుడు నీళ్లు లేక రెండు బోర్లు ఎండిపోయాయి. వరి పంట చేతికి వచ్చే దశలో బోర్లు ఎండిపోవడంతో నీళ్లు పెట్టలేని పరిస్థితి ఉంది. సాగునీరు లేకపోవటంతో కండ్ల ఎదుట చేతికి వచ్చిన పంట ఎండిపోతుండడంతో తట్టుకోలేకపోతున్న. సాగునీరు వచ్చే పరిస్థితి కనిపించకపోవడంతో పశువులను వరి పొలాల్లో మేపుతున్న...

– నర్సింహులు, రైతు, నిజాంపేట (సంగారెడ్డి జిల్లా)

నిలువ నీడలేదు.. ఆదుకోండి

రోడ్డునపడ్డ హుస్నాబాద్ అగ్నిమాపక సిబ్బంది.. పట్టించుకోని ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు

- దుమ్ము, ధూళితో భరించలేకున్నాం: సిబ్బంది
- తాత్కాలికంగా వేరే చోటు భవనం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి

తాత్కాలిక భవన్‌లో ఉన్న హుస్నాబాద్ ఫైర్‌స్టేషన్

హుస్నాబాద్ టౌన్, ఏప్రిల్ 7: నిలువ నీడలేక రోడ్డున పడ్డామని... ఆదుకోండి... అంటూ సోమవారం హుస్నాబాద్ అగ్నిమాపక సిబ్బంది వేడుకున్నారు. అగ్నిమాపక శాఖకు సరైన భవనం లేకపోవడంతో వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతుమిత్ర సంఘాల పరస్పర సమాఖ్య భవనంలో తాత్కాలిక కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. సిబ్బందికి సరిపడా గదులు లేకపోవడం, ప్రమాదాల నివారణకు సంబంధించిన పరికరాలు పెట్టేందుకు గది లేకపోవడంతో కొంతకాలంగా యార్డులోని ఒక వ్యాపారి అద్దెకు తీసుకున్న షెటర్‌లో నిల్వ ఉంచారు. సదరు వ్యాపారికి పండ్ల సీజన్ రావడంతో ఖాళీ చేయమన్నాడు. అగ్నిమాపక నివారణ పరికరాలను కార్యాలయం ఎదుటే పెట్టాల్సిన దుస్థితి నెలకొంది.

సౌకర్యాలు కరువు..

హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో 2010లో తాత్కాలికంగా ఫైర్‌స్టేషన్ కాంట్రాక్ట్‌తో ప్రారంభం కాగా.. 2022లో అగ్నిమాపక శాఖ స్వాధీనం చేసుకొని నిర్వహిస్తున్నది. దీనికి సొంత భవనం లేకపోవడంతో మార్కెట్ యార్డులోనే ఫైర్ అధికారి, వాహనం, సిబ్బంది ఉంటున్నారు. నీటి సౌకర్యం, సొన్నాలు, మరుగుదొడ్లు లేక సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు.. మార్కెట్ యార్డు కావడంతో ఎప్పుడూ ధాన్యంతో నిండి ఉండడంతో ప్రమాదాలు జరిగినప్పుడు వాహనం బయటకు తీసేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పైగా దుమ్ముధూళి ఎక్కువగా వస్తుండటంతో సిబ్బందికి అనారోగ్యంతో పాటు వాహనం సైతం మొరాయిస్తుండడంతో సిబ్బంది అవస్థలు పడుతున్నారు.

వేడుకున్నా.. పట్టించుకోవడం లేదు

యార్డులో దుమ్ముధూళి భరించలేకపోతున్నామని, అగ్నిమాపక పరికరాలు, సిబ్బంది ఉండేందుకు ఇబ్బందులు అవుతున్నాయని ఫైర్‌స్టేషన్ సిబ్బంది ఇటీవల బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌తో పాటు పలువురు స్థానిక ప్రజాప్రతినిధులను వేడుకున్నా.. ఎవరూ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఫైర్‌స్టేషన్‌కు స్థలం కేటాయించినప్పటికీ భవన నిర్మాణం ప్రారంభం కాకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. పట్టణంలో నిరుపయోగంగా ప్రభుత్వ భవనాలు ఉన్నప్పటికీ ఫైర్‌స్టేషన్‌కు ఇచ్చేందుకు ప్రజాప్రతినిధులు చొరవ చూపకపోవడంతో వారు రోడ్డున పడాల్సి వచ్చిందని పలువురు ఆరోపిస్తున్నారు.

తాత్కాలికంగా వేరే చోటు కల్పించండి

ఫైర్ సిబ్బంది ఉండేందుకు, పరికరాలు పెట్టేందుకు ఇబ్బందిగా ఉంది. ఒక వ్యాపారి గదిలో ఇన్నాళ్లు పరికరాలు పెట్టుకున్నాం. ఖాళీ చేయమనడంతో ఎక్కడికి పోవాలో తెలియని పరిస్థితి. తాత్కాలికంగా వేరే ప్రాంతంలో ఫైర్‌స్టేషన్ ఏర్పాటు చేసేందుకు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు సహకరించాలి.

– రాజయ్య, ఫైర్ ఆఫీసర్, హుస్నాబాద్ టౌన్

గది ఖాళీ చేయించడంతో హుస్నాబాద్ ఫైర్‌స్టేషన్ ఎదుటే పెట్టిన పరికరాలు

సన్న బియ్యం సరే... రేషన్ కార్డులేవి?

- సన్నబియ్యంలో 25శాతానికి పైగా నూకలే..
- మెదక్ జిల్లాలో ప్రతినెలా 4.430 మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా
- సన్న బియ్యంపై పెదవి విరుస్తున్న లబ్ధిదారులు

రామాయంపేటలో రేషన్ షాపు వద్ద గుమిగూడిన ప్రజలు

రామాయంపేటలోని ఓ రేషన్ షాపులో సన్నబియ్యం

మెదక్, ఏప్రిల్ 7(నమస్తే తెలంగాణ): జిల్లాలోని ఆయా రేషన్ షాపులకు సరఫరా చేస్తున్న సన్న బియ్యంలో నూకలు ఎక్కువగా వస్తున్నాయని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. నాణ్యతతో కూడిన సన్న బియ్యం సరఫరా చేస్తే బాగుంటుందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని రేషన్ దుకాణాల్లో 25శాతానికి మించి నూకలు ఉండడం, వండితే అన్నం ముద్దగా అవుతుందని మహిళలు వాపోతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రేషన్ దుకాణాలకు సరఫరా చేసే బియ్యంలో నూకలు తక్కువగా ఉండేవి. ఇప్పుడు పంపిణీ చేస్తున్న సన్నబియ్యంలో నూకల శాతం పెరగడంతో లబ్ధిదారులు చాలా ఇబ్బందులు పడుతున్నారు.

కొత్త రేషన్ కార్డుల కోసం తప్పని నిరీక్షణ

పంద్రాగస్టు రోజు ఎంపిక చేసిన గ్రామాల్లో రేషన్ కార్డులు పంపిణీ చేసి మురిపించారు. ఆ తర్వాత కొత్త రేషన్ కార్డుల ఊసే ఎత్తడం లేదు. రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పుల కోసం పలుమార్లు పౌర సరఫరాల శాఖకు దరఖాస్తులు స్వీకరించినా ఎలాంటి ప్రయోజనం లేదు. కొత్తగా పెండ్లి చేసుకొని అత్తగారింటికి వచ్చినవారి పేర్లు, పిల్లల పేర్లు చేర్చాల్సి ఉంది. ఇప్పటికే పలుమార్లు దరఖాస్తు చేసుకున్నవారు కార్డుల్లో పేర్లు నమోదు కాకపోవడంతో నిరాశకు గురవుతున్నారు. మెదక్ జిల్లాలో 520 రేషన్ దుకాణాలు ఉండగా, 2,13,828 రేషన్ కార్డులు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 6,96,043 మంది లబ్ధిదారులు ఉండగా, ప్రతినెలా 4,430.496 మెట్రిక్ టన్నుల బియ్యం రేషన్ దుకాణాలకు సరఫరా అవుతోంది. జిల్లాలో 22,589 మంది కొత్తగా రేషన్ కార్డుల్లో పేర్ల నమోదుకు దరఖాస్తు చేసుకున్నారు. 1,369 మంది కొత్తగా రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. వీటిపై పట్టణాలు, గ్రామాల్లో విచారణ జరుగుతోంది. కులగణన సర్వేలో భాగంగా జిల్లాలో 11,515 మంది దరఖాస్తులు చేసుకోగా, అందులో 405 రేషన్ కార్డులు పంపిణీ చేశారు. కాంగ్రెస్ సర్కార్ సన్న బియ్యం సరఫరా చేస్తుంది సరే కొత్త రేషన్ కార్డుల మాటేమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పలు రేషన్ షాపుల్లో సన్నబియ్యం లేక నో స్టాకు బోర్డులు దర్శనమిస్తున్నాయి. పలుచోట్ల సన్నబియ్యం పంపిణీ ఇప్పటి వరకు ప్రారంభం కాలేదని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ పక్కాగా అమలు చేయాలని వారు కోరుతున్నారు.